# 31. ఇక్కడ మొక్కలు ఎదగవు

జి. లక్ష్మి

"చెట్టు నుంచి వేళ్ళాడే పిచ్చుక గూళ్ళలాగా ఏమిటో ఈ బతుకులు?" నిట్టూర్చింది కళ. పిచ్చుకలన్నా ఒకదాని గూట్లోకి ఒకటి తొంగి చూస్తాయేమో, వీళ్ళు ఆ పని కూడా చేసేలా లేరు. ఎక్కడి కక్కడ తలుపులు బిగించుకున్న క్వార్టర్సు గదులవైపు చూస్తూ వెనుకవైపు బాల్కనీలోకి వచ్చి నిలబడింది. క్వార్టర్సు వెనుక ఖాళీ స్థలంలో కాగితాలు ఏరుకునే వాళ్ళ గుడారాల్లాంటివి ఉంటే వాటి వంక చూస్తూ నుంచుంది.

అక్కడ ఓ పది పదిహేనుమంది పిల్లలు ఒంటిమీద గోచీపాత కూడా లేకుండా దుమ్ములో ఆడుతున్నారు. పెద్దవాళ్ళు అందరూ కాగితాలు ఏరుకోవడానికి వెళ్ళి పోయినట్టున్నారు. ఇంక వీళ్ళు మిగిలారు. కొన్ని రోజులు పోయిన తరువాత రెక్కలు రాగానే వీళ్ళూ కాగితాలు ఏరుకొచ్చి ఉడతాభక్తి సాయపడతారు గావును. ఏం బతుకులో ఆ మురుగ్గుంటలోని పందులకూ ఈ పిల్లల కన్నా భద్రత, రక్షణ ఉంది అనుకుంది కళ. ఆమెకు ఒక్కసారిగా సాయంత్రం డాక్టరు చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. ఆమె మనస్సు బాధగా మూలిగింది. తనకు రెండో నెల నిండుతూందిట. అంటే ఇంకో ఎనిమిది నెలల్లో తనూ ఓ ప్రాణిని ఈ జనారణ్యంలోకి వదులుతుందన్న మాట.

అందరూ మాతృత్వం, మమత అంటూ గొప్ప గొప్ప కబుర్లు చెబుతారు. డాక్టరు ఆ మాట చెప్పగానే తనెందుకు సంతోషించలేక పోయింది? తను చదివిన పుస్తకాల్లో అందరూ అలాంటి సందర్భాల్లో ఎంతో పొంగిపోయినట్లు ఉంది. మరి మరి తనకు అలాంటి అనుభూతి ఏమీ కలగలేదేమిటి? పైగా ఏదో బరువుతో గుండె నిండి పోయినట్టుంది. అది తనలో లోపమా? దేనికి అంతగా చలించకూడదని కష్టపడి

అలవాటు చేసుకున్న మనస్తత్వం ప్రభావమా?

తన మనస్సులో ఏదో పురుగు తొలుస్తోంది. అది స్పష్టంగా కనిపించడం లేదు. కానీ ఎక్కడో ఎదలోపలి లోతుల్లో తిరుగుబాటు జరుగుతోంది. అది చివరికి ఎటు దారితీస్తుందో?

"కళా! ఏమిటలా చీకట్లో నిలబడ్డావు, లైటు కూడా లేకుండా?" మధు మాటలకు ఈ లోకంలోకి వచ్చింది కళ.

"లోపలకు వెళ్దాంరా మంచు కురుస్తోంది" ఆమె భుజాల చుట్టూ చేతులు వేశాడు మధు.

"ఊ" అంది. కానీ అక్కడి నుంచి కదలబుద్ధి కావడంలేదు కళకు. లైటేస్తే తన ముఖంలోని మార్పు కనిపిస్తుంది మధుకి. అడిగితే ఏం చెప్పాలి? ఆమె ఆలోచన తెగనేలేదు, మధు అడిగేశాడు.

"కళా! ఏమైంది నీకు అలా ఉన్నావు? డాక్టరు చెప్పింది వినగానే నా కెంత సంతోషంగా అనిపించిందో తెలుసా. నీ ముఖం చూడగానే అదంతా చప్పున చల్లారిపోయింది. ఎందుకు బాధపడుతున్నావో చెప్పవా? ప్లీజ్. పోనీ మీ అమ్మను పిలిపించమంటావా?" అనునయంగా అడిగాడు మధు, భుజాలమీద చేతులు తీయకుండానే.

కళకు గుండెల్లోంచి దుఃఖం తన్నుకొస్తోంది. తన కేమయిందో తనకే తెలియడం లేదు. ఒకటి మాత్రం తెలుస్తోంది. తన ఇంట్లో అడుగు పెట్టబోయే కొత్త ప్రాణిని ఆహ్వానించడానికి తాను సిద్ధంగా లేదు. అది మాత్రం నిజం కానీ ఎందుకు అంటే తనేం చెప్పగలదు?

తను ఎందుకు వద్దనుకుంటుందో చెబితే మాత్రం అర్థమవుతుందా? తన గుండెలోతుల్లో సుడులు తిరుగుతున్న ఆర్తిని మధుకి అర్థమయ్యేలా చెప్పగల శక్తి తన కుందా? తీరా ఇంతా చెప్పిన తరువాత, తన నో పిచ్చిదాన్ని చూసినట్టు చూస్తే? తన మాటలు నవ్వుతూ తేలిగ్గా కొట్టిపడేస్తే? తను భరించగలదా? ఊహూ! అందుకే మధుకి కారణం చెప్పద్దు. తనకు ఇప్పుడే ఇష్టం లేదని చెబుతుంది అంతే. తరువాత సంగతి తరువాత చూసుకోవచ్చు. కళ ఆలోచనలు ఒక రూపు దిద్దుకొంటున్నాయి.

"మధూ. నాకీ పాప వద్దు" ఎలాగో గొంతు పెగల్చుకుని అంది కళ. ఆ మాట అంటుంటే ఆమె గొంతు వణికింది. మధు తలెత్తి కళ ముఖంలోకి చూశాడు. చీకట్లో ఆమె మోహంలోని భావాలేమీ కనిపించలేదు.

"కళా! ఏమిటీ పిచ్చి? ఎందుకు ఫీలవుతున్నావో నాకు చెప్పొచ్చుగా చెబితే నేను ఆ మాత్రం అర్థం చేసుకోలేని మూర్ఖుడిని కాదుగా" మెత్తగా ఉంది అతని గొంతు.

"ప్లీజ్ నాకు కొంత టైమివ్వు. ఇప్పటి నుంచే ఆ బాధ్యత అంతా తలకెత్తుకోవాలంటే భయం వేస్తోంది. ఇంకా మన బతుకులకే ఒక స్థిరత్వం అంటూ రాలేదు. ఇంక వచ్చే వాళ్ళకు ఏం చేయగలం?" కళ గొంతులో తడి.

మధు ఒక్క క్షణం ఏం చెప్పలేనట్టు నిస్సహాయంగా చూస్తుండిపోయాడు. నిజమే. ఇంకా తామే లైఫ్‌లో సెటిల్ కాలేదు. అప్పుడే కొత్త బాధ్యతలంటే కష్టమే. కానీ సెటిల్ కావడమనేది అన్‌సర్టైన్ అయినప్పుడు ఎంతకాలం వాయిదా వేయాలి? కళ ఇంకెందుకో కూడా బాధపడుతోంది. తనకెలా తెలుస్తుంది? తనెలా తెలుసుకోగలడు? ప్రస్తుతానికి తాను చేయగలిగిందల్లా కళ ఇష్ట ప్రకారం కానివ్వడమే అని నిర్ణయించుకున్నాడు మధు.

• • •

"హలో! ఆంటీ! నేను మధుని."

"ఊ, చెప్పు ఏమిటి కబుర్లు, ఈ మధ్య ఎక్కడా కనిపించడం మానేశావేం?" అడిగింది డాక్టరు విమల.

"కొద్దిగా బిజీగా ఉంది ఆంటీ. అందుకే..." నసిగాడు మధు.

"ఎప్పుడూ ఈ సుత్తి ఎక్స్‌ప్లనేషనే కదా. అఘోరించావు కానీ ఇంతకీ కళ ఎలా ఉంది?" అడిగిందావిడ.

"తన విషయమే చెబుదామని ఫోన్ చేశాను. తన కిప్పుడు ప్రెగ్నెన్సీ సెకండ్ మంత్"

"అలాగా! మరి స్వీట్ ఎప్పుడు తినిపిస్తున్నావు!?"

"సారీ ఆంటీ! తను అబార్షన్ చేయించుకోవాలనుకుంటోంది." చెప్పలేక చెప్పాడు మధు.

"అరె! ఏమైంది తనకి? ఏజ్ ఎక్కువయ్యేకొద్దీ తరువాతే కష్టం అవుతుంది" ఆదుర్దాగా అడిగిందావిడ.

"అదే నాకూ తెలీడంలేదు. అడిగినా చెప్పడంలేదు. తను ఎందుకో విపరీతంగా బాధపడుతోంది. తనకి నీ దగ్గరబాగా చనువు కదా....

నువ్వు అడిగితే నీ కేమయినా చెబుతుందేమో అనీ" బరువుగా పలికింది మధు గొంతు.

"ఊ! అలాగే రేపు నేను వస్తాలే. ఈ లోగా ఈ విషయం నువ్వేమీ అడగకు తనని. మామూలుగా ఉండు," చెప్పిందావిడ.

"అలాగే" ఫోన్ పెట్టేశాడు మధు.

• • •

"ఇప్పుడు చెప్పు కళా. ఎందు కా నిర్ణయ తీసుకున్నావు?" అనునయంగా అడిగింది డాక్టర్ విమల.

"నేనే మీ దగ్గరకు వద్దామనుకున్నాను ఆంటీ. ఇంతలోకే మీ రొచ్చారు" సంజాయిషీగా అంది.

"అది సరేలే. ఎవరొస్తే ఏంలే గానీ. మనం అలా డాబా మీదకు వెళదాం రా. కొద్ది సేపు ఫ్రీగా మాట్లాడుకోవచ్చు." పైకి దారితీసిందావిడ.

పలుచని వెన్నెల వెలుతురులో కింద కనిపిస్తున్న తెల్లని గుడారాలని, పిల్లల ఏడుపులు, గోలల మధ్య మూడు మూడు రాళ్ళు పేర్చి వంటకోసం పెద్దవాళ్ళు చేస్తున్న ప్రయత్నాలని, అప్పుడే వాళ్ళు ఏరుకొచ్చి గుట్టలుగా పోసిన కాగితాల్ని చూస్తూ మౌనంగా నిలబడింది కళ.

ఆమెకు ఆలోచించడానికి టైమిచ్చినట్లుగా తనూ అటే చూస్తూ నిలబడిందావిడ. మట్టిలో ఆడుతున్న ఆ పిల్లల కేసి అలా తదేకంగా

చూస్తున్న కళను చూసి ఆమె ఎందుకు బాధపడుతోందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. మౌనాన్ని ఇంకా ఎక్కువ సేపు భరించలేనట్టుగా కళ మెల్లగా గొంతు విప్పింది.

"ఆంటీ! నేను ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నానో చెబితే మీకు ఫూలిష్‌గా అనిపించొచ్చు. కానీ ఒక ప్రాణిని ఈ లోకంలోకి తీసుకురావాలా, వద్దా అనే విషయంపై జన్మనిచ్చే తల్లిగా నాకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఉందనుకుంటున్నాను. నా పాప భవిష్యత్తు గురించి ఆలోచించే హక్కు నాకు ఉందంటారా? లేదంటారా?" నిశ్చలంగా ఉంది ఆమె గొంతు.

"లేదని ఎవరు అనగలరు కళా" అందావిడ కళ భుజాన్ని అనునయంగా తడుతూ.

"అయితే... అయితే ఆ హక్కు నాకున్న పక్షంలో ఆ ప్రాణి ఎప్పటికి ఈ లోకంలోకి రావాలనే నాకు లేదు. కడుపులోనే నా చిట్టితల్లిని భద్రంగా దాచుకొంటాను." స్థిరంగా చెప్పిందామె.

ఆమె గొంతులో కనిపిస్తున్న నిశ్చయానికి ఆందోళనగా చూసిందావిడ.

"నేను ఈ మాట ఆవేశంతో చెప్పడంలే దాంటీ. ఎంతో ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను. డాక్టరు ఈ మాట చెప్పకముందు వారం కిందే పసికట్టాను. అప్పటి నుంచీ అదే ఆలోచిస్తున్నాను.

మీకు తెలుసు కదూ ఆంటీ – ఇద్దరు మొగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లల మధ్య మూడోదాన్నిగా పుట్టాను నేను. వెనుక స్థిర, చరాస్తులు అంటూ ఏమీ లేకుండా కేవలం తన రెక్కల కష్టంతో మమ్మల్నందరినీ చదివించాడు నాన్న. దానికోసం ఆయన ఎంత కష్టపడ్డాడో, ఎన్నిపాట్లు పడ్డాడో నాకు అంతగా తెలీదు కాని అదంతా మా అమ్మానాన్నే అనుభవించారు. వాళ్ళు పడుతున్న కష్టం మాకు ఎక్కడ తెలుస్తుందో అని తెల్లవారు జామున అందరూ నిద్రపోయేటప్పుడు చిన్నగా చెప్పుకునేవారు.

పెద్దదానికి ఫీజు, నాలుగోవాడికి బట్టలు, అయిదోవానికి పాలడబ్బా అంటూ అమ్మ చిన్న గొంతుతో చెబుతుంటే నాన్న బరువుగా నిట్టూర్చడం దుప్పటి ముసుగులో నుంచి విని కదిలిపోయేదాన్ని ఏమీ చేయలేని

నిస్పృహాయత, భారంగా తయారవుతున్నామనే గిల్టీ ఫీలింగ్‌తో తెల్లవారి అమ్మ నాన్నల ముఖంలోకి సూటిగా చూడలేక పోయేదాన్ని. అవసరాల్ని పరిమితం చేసుకుని, ఫేషన్లు, విలాసాలు అంటూ వేధించకుండా చదువే ధ్యేయంగా స్కాలర్‌షిప్పులతో నెట్టుకొచ్చాం మేమంతా.

ఎంత సరిపెట్టుకుందామన్నా మిగతావాళ్ళతో పోల్చుకున్నప్పుడో, కాలేజీల్లో ఎక్స్‌కర్షన్‌లనో, టూర్‌లనో వచ్చినప్పుడో, బెనిఫిట్ షోలు, విరాళాలు అంటేనో అప్పుడు స్పష్టంగా కొట్టొచ్చినట్లు కన్పించేది మా దారిద్ర్యం. మేం దాని పడగ నీడలో నుంచి బయటపడడానికి మా నాన్న అహర్నిశలూ చేసిన పోరాటం తల్చుకుంటే ఇప్పటికీ గుండెల్లోంచి వణుకు పుట్టు కొస్తుంది నాకు. అమ్మానాన్నల రక్త మాంసాలు పేర్చిన నిచ్చెన లెక్క ఒక స్థాయికి చేరినా ఒక్కో మెట్టూ ఎక్కేటప్పుడు దానికి నాన్న చెల్లించిన మూల్యాన్ని తల్చుకుంటూ వెక్కెక్కి ఏడ్చేదాన్ని.

ఎలాగైతే నేం మా అందరి చదువులు పూర్తయి ఉద్యోగాలు దొరికాయి. మమ్మల్ని ఇష్టపడి వచ్చిన వాళ్లతోనో, నాన్నా వాళ్లు వెతికి తెచ్చిన వాళ్ళతోనో మా జీవితాలు ముడిపడి పోయాయి.

ఆధారంగా నిలిచిన నిచ్చెనలను కాలదన్ని తలోచోటకి ఎగిరిపోయాం. ఇంత కష్టపడి కొవ్వొత్తుల్లాగా కరిగిపోతూ మమ్మల్ని వెలిగించినందుకు వాళ్ళకు మేం మిగిల్చిందేమిటో తెలుసా – పుట్టెడు అప్పులు, గుండెడు దిగులు. వాటి వెనుక మమ్మల్ని చూసిన కొండంత సంతృప్తి ఉందని తెల్సు, కానీ అది అప్పులు తీర్చలేదు కదా!

ఉద్యోగాలు దొరికే వరకూ, తర్వాత జీవితంలో సెటిల్ అయ్యేవరకూ అడుగడుగునా ఎంత టెన్షన్, ఎంత నిరాశ, ఎంత సంతోషం, మరెంత ఉద్వేగం – ఎన్ని దశలను దాటామో తెలుసా అంటే? ఎవరి ముఖం చూస్తే ఎప్పుడే అగ్నిపర్వతం పేలుతుందో అని, ఎవరి ఆత్మహత్యాలు చూడాల్ని వస్తుందో అని, దిన దినగండంగా బతికాం. జీవితాలకు తగిన రక్షణ లేదని భద్రతా రాహిత్య భావం సృష్టించిన అలజడి అది. సరస్సులో రాయి విసిరితే అలలు చెదిరినట్టుగా భద్రతారాహిత్య భావం మా జీవితాల్ని ఒక ఊపు ఊపిపోతూ స్థిరత్వాన్నిచ్చిపోయింది. ఇప్పటికే

ఆ అదృష్టానికి పొంగిపోతుంటాను.

నా చిన్నప్పటి కన్నా జీవితం ఇప్పుడెంత భయంకరంగా, వికృతంగా మారిందో చూడు. మా అమ్మా నాన్నా అంత కష్టపడినా చివరకు మమ్మల్ని ఏదో ఒక ఒడ్డు చేర్చగలమనే ఆశ వారికుండేది. ఇప్పుడా నమ్మక మేదీ?

అడుగడుగునా భద్రతారాహిత్య భావం, రోజు రోజుకీ పెరుగుతున్న క్లిష్టత, అస్తిత్వం కోసం పోరాటం, జీవితంలో పెరిగిపోయిన వేగం, స్వచ్ఛతను పారేసుకుని కాలుష్యాన్ని నింపుకుంటున్న బతుకులు – ఇందులోకి, ఈ విషవలయంలోకి, జనారణ్యంలోకి ఏ ధైర్యంతో కొత్త ప్రాణిని ఆహ్వానించమంటావో నువ్వే చెప్పు. పక్షులు చూడు. రెక్కలొచ్చే వరకూ పిల్లల్ని తమ రెక్కల చాటున కాపాడి అప్పుడు జీవన సమరంలోకి దింపుతాయి. మన కా ధైర్య మేది?

మూడేళ్ళు వచ్చీ రాగానే బండెడు పుస్తకాల సంచులు భుజాన తగిలించి అరణ్యంలోకి వదులుతాం. నగరమంతా పరుచుకున్న పచ్చని గెద్దలు ఎప్పుడే పసికూనను నోట కరచుకుంటాయో అనిబితుకు బితుకుమంటూ గడుపుతాం. 'సర్వైవల్ ఆఫ్ ది ఫిట్టెస్ట్' సూత్రాన్ని ఉగ్గుపాలతో రంగరించి పోరాటంలోకి దింపుతాం. ఆ పోరాటంలో వాడి రెక్కలు విరిగినా, కాళ్ళు తెగినా, మనసు పొరలు దెబ్బతిన్నా – అవన్నీ మనకు పట్టవు. మార్కులతో వాటిని కొలిచి క్షణ క్షణం చిత్రహింసలపాలు చేస్తాం.

ఇంతా చదివి పెద్దయితే వాడికి ఉద్యోగమే వస్తుందో, ఉరే దిక్కవుతుందో, ఏ భయంకర క్షణం ఏ లోయలోకి విసిరేస్తుందో ఏం చెప్పగలం? మా పెదనాన్న కొడుకు రవి తెలుసుకదా నీకు ? ముప్పయేళ్ళ వరకు ఉద్యోగం కోసం ఎదురుచూసి ఎదురు చూసి అది గగన కుసుమమవడంతో ఆ నిరాశను తనను కన్నవాళ్ళ మీదకు తిప్పి, నాకు సరైన దారి-చూపించలేనప్పుడు మిమ్మల్ని ఎవడు కనమన్నాడు? అని అడిగినప్పటి క్షణం, ఆ ముసలి గుండెలు ఆవేదనతో, సిగ్గుతో తల్లడిల్లి పోయిన ఆ క్షణం ఇంకా నాకు అలాగే గుర్తుంది అంటే.

రైలుపట్టాల కింద తలపెట్టి జీవితాన్ని వెక్కిరిస్తూ వాడు చనిపోయినప్పుడు వాడి గొంతులోంచి పుట్టిన ఆ ప్రశ్న వేల వేల శబ్దాలుగా మారి, ఇప్పటికీ భయ పెడుతోంది నన్ను. జీవితపోరాటంలో రాలిపోయిన పసిమొగ్గను చూస్తూ ఇంకో మొగ్గను విచ్చుకో తల్లీ అనగలిగే ధైర్యం ఎలా చేయను చెప్పు? వాడికి చక్కని జీవితాన్ని హామీ ఇవ్వలేనప్పుడు అనవసరంగా జన్మ నిచ్చి ఉసురుపోసుకోవడ మెందుకు? తర్వాత జీవిత మనే ముళ్ల చెట్టు వాడి బతుకు నిండా వాడిముళ్ళు దించుతుంటే గిలగిల లాడడమెందుకు?

పక్షి తన పిల్లల్ని రెక్కల కింద భద్రంగా దాచినట్టే వాడినీ నేను నా కడుపులో భద్రంగా దాచుకుంటాను. ఎప్పటికీ వాడిని ఏ కష్టం పడనివ్వకుండా కంటిరెప్పలాగా కాపాడుకొంటాను. రవి లాగా ప్రశ్నించే అవకాశాన్ని వాడికి ఇవ్వదలచుకోలేదు.

నాది నిరాశావాదం అని నువ్వన్నా, చూస్తుంటేనే కళ్ళు తిరిగే ఈ సుడిగుండంలోకి చూస్తూ చూస్తూ పువ్వులాంటి నా బాబును ఎలా దింపమంటావు అంటీ, ఎలా దింపమంటావు?" రెండు చేతులతో మోహం కప్పుకుంది కళ వెక్కెక్కి పడుతూ. "కింద ఆ మైదానంలో ఆడుకొంటున్న పిల్లల్ని చూస్తున్నావు కదూ. ఎగరేసిన గాలి పటాల్లాంటివి వాళ్ళ జీవితాలు. బతుకుకి కలిపే దారం ఎప్పుడు పుటుక్కుమంటుందో తెలీని అనిశ్చిత బతుకులు వాళ్ళవి. ఉండేచోటు వేరు అనే కానీ, వాళ్ళ బతుకుల కన్నా ఎక్కువ భద్రత నా పిల్లలకు మాత్రం ఎక్కడినుంచి తేగలను చెప్పు?

పిల్లలు ఎందుకు కావాలనుకొంటాం? వార్ధక్యంలో మనకు తోడుంటారని, వాళ్ళ నీడలో చల్లగా దాటిపోవచ్చనే కదా! మా నాన్నకు ఐదుగురు పిల్లలున్నా ఒకళ్లం అయినా వాళ్లకు ఇంత నీడ ఇవ్వగలిగామా? రెక్కలు విప్పుకుని ఎగిరొచ్చేశాం కానీ కష్టపడి పెంచినందుకు ప్రతిఫలం ఉండాలని ప్రతిఫలం లేకపోతే పిల్ల లెందుకనీ కాదు నేను అనేది. కనీసం మన పిల్లలు చివరి ఘడియల్లో మన దగ్గరుండాలనే ఆశ కూడా లేకుండా ఎలా? ఆంటీ! ఎంత

కాదనుకున్నా మన బతుకుల్లో ప్రేమాభిమానాలు, ఆప్యాయతలు ఎంత తగ్గిపోతున్నాయో చూడు. తాతల కాలంలో పెంచినంత ప్రేమగా మన తల్లిదండ్రులు మనల్ని పెంచలేకపోయారు. మనం మన పిల్లల్ని కనీసం అలా కూడా పెంచలేం. వాళ్ళు వాళ్ళ పిల్లల్ని మరీ అధ్వాన్నంగా... ఇది ఇలా వెళ్ళి చివరికి ఎక్కడ ఆగుతుందో చెప్పు?

ప్రేమలు, అభిమానలు లేకుండా అందరూ చేస్తున్నారు, మనమూ చేస్తున్నామని యాంత్రికంగా మెషీన్లలాగా వాళ్ళకు జన్మ నిచ్చి అంతకన్నా యాంత్రికంగా పెంచలేకపోతే నేం? పిల్లల్ని కనడం పెంచడం అనేదాన్ని ఒక అలవాటుగా, తప్పనిసరి బాధ్యతగా అనుకోవడం దేనికి? వాళ్ళ బతుకుల్ని కూడా గాలిలో దీపాల్లాగా పెట్టి కాలానిదే దిక్కని వదిలేయడం దేనికి? అందుకే నేనీ నిర్ణయం తీసుకున్నాను. నువ్వే చెప్పు ఆంటీ. ఇదంతా విన్న తర్వాత కూడా నా భయం అర్థరహితంగా, మూర్ఖత్వంగా కనిపిస్తోందా నీకు? నా ఆలోచనల్లో ఏదైనా లోపం ఉందంటావా ఆంటీ?" బేలగా అడిగింది కళ.

డాక్టర్ విమల కంటి నుంచి, ఏ కదలిన ఆవేదనకు చిహ్నామో ఓ నీటిచుక్క జారింది. నీ భయం అర్థం లేనిదని నేనెలా చెప్పగలను తల్లీ–అని ఆ నీటిచుక్క అంటూవున్నట్టనిపించిందావిడకు.